క్లుప్తంగా

రేపు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా

నల్లగొండటౌన్: మున్సిపల్ కార్మికులకు పీఎఫ్ చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న నల్లగొండ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ అధ్యక్షుడు ఎండీ సలీం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి దండంపల్లి సత్తయ్య అన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవన్‌లో నిర్వహించిన మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల సమావేశంలో వారు మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలో పని చేస్తున్న 110 మంది కాంట్రాక్టు కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో గంధమల్ల సునిత, గోవుల విజయ, కుంచం మహేష్, యాదయ్య, జోజి, పార్వతమ్మ, వాణి, పరశురాం, తిరుమలేశ్వరి, ముత్తమ్మ, నర్సింహ పాల్గొన్నారు.

నేరడలో ప్రజా సంఘాల సభ్యత్వ నమోదు

చిట్యాల: మండలంలోని నేరడ గ్రామంలో ప్రజా సంఘాల సభ్యత్వ నమోదును వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారీ అయిలయ్య ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వ్యవసాయ కార్మికుల కుటుంబానికి రూ.12వేలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బొజ్జ చినవెంకులు, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, ఐద్వా కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఐతరాజు నర్సింహ, కల్లూరి కుమారస్వామి, కందగట్ల గణేష్, సంకోజు నర్సింహాచారి, కల్లూరి క్షేత్రయ్య, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ కన్వీనర్‌గా అశోక్



మునుగోడు: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్‌పీఎస్) నియోజకవర్గ కన్వీనర్‌గా మునుగోడు పట్టణానికి చెందిన పందుల అశోక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మునుగోడులోని బాబు జగ్జీవన్‌రావ్ భవనంలో సంఘం జిల్లా అధ్యక్షుడు రామంజి సైదులు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుషిపాక నర్సింహల సమక్షంలో ఈ ఎన్నిక నిర్వహించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



శ్రీకంఠమహేశ్వరాలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న మాజీ ఎంపీపీ

మర్రిగూడ: మండలంలోని యరగండ్ల గ్రామంలో నిర్మిస్తున్న కంఠమహేశ్వరస్వామి దేవాలయ నిర్మాణానికి మాజీ ఎంపీపీ అనంత రాజుగౌడ్ ఆదివారం రూ.25వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు దర్శన్‌గౌడ్, ముద్దం శ్రీనివాస్‌గౌడ్, పోలగోని రాజేష్‌గౌడ్, పోలగోని రమేష్‌గౌడ్, నల్ల రమేష్‌గౌడ్, చామకూర మత్తు, గణేష్, అయోధ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి గడ్డపై బీజేపీ జెండా ఎగురవేయాలి

చండూరు: భువనగిరి గడ్డపై బీజేపీ జెండా ఎగురవేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు కాసాల జనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం చండూరులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం సుభిక్షంగా ఉండాలంటే మూడోసారి కేంద్రంలో నరేంద్ర మోదీ సర్కార్ రావాలని అన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్య గౌడ్ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని సూచించారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన టెన్త్ ప్రశ్నపత్రాలు



చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో ప్రశ్నపత్రాల బాక్స్‌లకు సీల్ వేస్తున్న అధికారులు

చిట్యాల: పదో తరగతి వార్షిక పరీక్షలు ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభం కానుండడంతో ప్రశ్న పత్రాలను ఆదివారం చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో మండల విద్యాధికారి కె.నర్సింహ ఆధ్వర్యంలో భద్రపరిచారు. కార్యక్రమంలో చిట్యాల జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం కె.కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ

కేతేపల్లి: మండల కేంద్రానికి చెందిన నకిరేకల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొప్పుల ప్రదీప్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆదివారం కేతేపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు, అనాథ వృద్ధులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వెంకన్న, బీఆర్ఎస్ మహిళా మండల అధ్యక్షురాలు విజయరాణి, అంజయ్య, ఆరోగ్యం, లక్ష్మారెడ్డి, మహేష్, అరుణ్ పాల్గొన్నారు.

సబ్సిడీ గొర్రెలేవీ..?

- మునుగోడు మండలంలో పూర్తిస్థాయిలో అందని గొర్రెలు
- వాటా ధనం చెల్లించిన 1500 మంది లబ్ధిదారులు
- ఇప్పటివరకు పంపిణీ చేసింది 1400 మందికి మాత్రమే..
- ప్రస్తుత ప్రభుత్వమైనా ఇవ్వాలని వేడుకోలు



మునుగోడు: గొల్ల, కురుమల ఆర్థిక అభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకం చేపట్టింది. ఇందులో భాగంగా గత మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా అప్పటి ప్రభుత్వం నియోజకవర్గంలోని గొల్ల, కురుమలకు గొర్రెలు అందించేందుకు అర్హులైన లబ్ధిదారుల నుంచి రూ. 44వేల వాటా ధనం డిపాజిట్ చేయించింది. కానీ వారికి మాత్రం నేటికీ పూర్తిస్థాయిలో గొర్రెలు అందలేదు. ఇప్పటివరకు తిరిగి గొర్రెల పంపిణీ ప్రారంభించకపోవడంతో ప్రస్తుత ప్రభుత్వమైనా ఇస్తుందా లేదా అన్న సందేహాలను లబ్ధిదారులు వ్యక్తం చేస్తున్నారు.

1900 మంది అర్హులు..

ఉప ఎన్నికల సందర్భంగా మునుగోడు మండలంలో అధికారులు గొర్రెల పంపిణీకి మొత్తం 1900 మంది గొల్ల, కురుమలను అర్హులుగా గుర్తించారు. అందులో 1500 మంది తమ వాటాధనం రూ.44వేలు డీడీల రూపంలో గత సంవత్సరం ఆగస్టు, సెప్టెంబర్‌లో కట్టారు. వారందరికీ అప్పుడే మంజూరు కాగా.. ఇప్పటి వరకు విడతల వారీగా గతేడాది సెప్టెంబర్ వరకు 1400 మందికి మాత్రమే గొర్రెలు కొనుగోలు చేసి అప్పగించారు. డీడీలు చెల్లించిన 100 మందితో పాటు అర్హులైన 400ల మంది మొత్తం 500 మందికి గొర్రెలు అందించాల్సి ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకుని అర్హులైనా లబ్ధిదారులకు త్వరలో గొర్రెలు ఇప్పించాలని కోరుతున్నారు.

డీడీ చెల్లించిన వారందరికీ గొర్రెలు ఇప్పించాలి



గొర్రెల పంపిణీ పథకానికి అర్హులైన వారు వాటా ధనం కింద రూ.44 వేలు నగదు డీడీల రూపంలో చెల్లించారు. వారందరికీ గొర్రె లు ఇప్పించాలి. మొత్తం 1900 మంది అర్హులు ఉంటే అందులో కేవలం 1400 మందికి మాత్రమే ఇప్పించారు. గొర్రెల యూనిట్లు అందించి గొల్ల, కురుమల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించాలి.

– సాగర్ల లింగస్వామి, యాదవ సంఘం నియోజకవర్గ నాయకుడు

ఆదేశాలు రాగానే అందజేస్తాం

గతేడాది ఎన్నికల కోడ్ రాక ముందు వరకు అర్హులైన గొల్ల కురుమలకు గొర్రెలు పంపిణీ చేశాం. కోడ్ రావడంతో పంపిణీ పూర్తిగా నిలిపివేశాం. మండలంలో డీడీలు చెల్లించినవారు 1500 మంది ఉంటే దాదాపు 1400ల మందికి పంపిణీ చేశాం. ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేస్తే మిగిలిన వారికి కూడా పంపిణీ చేస్తాం.

– వెంకన్న, మునుగోడు పశువైద్యాధికారి

రూ.2లక్షల రుణమాఫీ అమలు చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీశైలం

చండూరు: రైతులకు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రూ.2 లక్షల రుణమాఫీ అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం అన్నారు. ఆదివారం చండూరు మండల కేంద్రంలో జెర్రిపోతుల ధనంజయ గౌడ్ అధ్యక్షతన మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తక్షణమే వరి ధాన్యం కింటాకు రూ.500 బోనస్ ప్రకటించాలన్నారు. భూగర్భ జలాల నీటిమట్టాలు రోజురోజుకు పడిపోతుండడంతో వాటి ఆధారంగా సాగు చేసిన పంట పొలాలకు తీవ్ర నీటి కొరత ఏర్పడుతుందని, ఏఎమ్మార్పీ, వరద కాలువల ద్వారా వీలైనన్ని చెరువులను నింపితే భూగర్భ జలాలు అందుబాటులోకి వస్తాయన్నారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి మొగుదాల వెంకటేశం, సీపీఎం మండల కమిటీ సభ్యులు చిట్టిమల్ల లింగయ్య, కొత్తపల్లి నరసింహ, గౌసియా బేగం, రవి పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక



బీజేపీలో చేరుతున్న సంజయ్‌దాస్‌గౌడ్

చిట్యాల: పట్టణానికి చెందిన తెలంగాణ ఉద్యమ నాయకుడు కునూరు సంజయ్‌దాస్‌గౌడ్ బీజేపీలో చేరారు. ఆదివారం భువనగిరిలో నిర్వహించిన పార్టీ సమావేశంలో బీజేపీ జాతీయ కార్యదర్శి సత్య కుమార్, భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ సమక్షంలో బీజేపీ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నకిరేకల్ నియోజకవర్గ కన్వీనర్ మైల నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్

మర్రిగూడ: బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా మర్రిగూడ మండల కేంద్రానికి చెందిన పిట్టల శ్రీనివాస్ ఆదివారం ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన స్థానికంగా మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి తనవంతుగా కృషి చేస్తానని అన్నారు. తన నియాకమానికి సహకరించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా వెంకన్న

నకిరేకల్: బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా కట్టంగూరు మండలం మునుకుంట్ల గ్రామానికి చెందిన మండల వెంకన్న నియామకమయ్యారు. ఈమేరకు ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన జిల్లా నేతలు గోలి మధుసూదన్‌రెడ్డి, నూకల వెంకటనారాయణరెడ్డి, నకిరేకంటి మొగిలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా కోశాధికారిగా మోహన్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: బీజేపీ జిల్లా కోశాధికారిగా నల్లగొండ పట్టణానికి చెందిన పకీరు మోహన్‌రెడ్డి నియామకమయ్యారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి శక్తి చేస్తానని తెలిపారు.

జిల్లా కార్యదర్శిగా అశోక్ గౌడ్

మునుగోడు: బీజేపీ జిల్లా కార్యదర్శిగా మునుగోడు మండలంలోని ఇప్పర్తి గ్రామానికి చెందిన బొడిగే అశోక్ గౌడ్ నియామకమయ్యారు.

అధికార ప్రతినిధిగా మునికుమార్

నల్లగొండటూటౌన్: బీజేపి జిల్లా ముఖ్య అధికార ప్రతినిధిగా నల్లగొండకు చెందిన పెరిక మునికుమార్ నియామకమయ్యారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం



క్రీడాపోటీలు ప్రారంభిస్తున్న మధుసూదన్ రావు

చండూరు: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు యత్తపు మధుసూదన్ రావు, చండూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ దోటి సుజాత అన్నారు. ఆదివారం చండూరు మండలంలోని తుమ్మలపల్లి గ్రామంలో జాతర సందర్భంగా తుమ్మలపల్లి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను వారు ప్రారంభించి మాట్లాడారు. టోర్నమెంట్‌కు ప్రథమ బహుమతి దాతగా యత్తపు మధుసూదన్ రావు రూ.25వేలు, ద్వితీయ బహుమతి దాతగా దోటి సుజాత వెంకటేష్ యాదవ్ రూ.15వేలు, తృతీయ బహుమతి దాతగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి గిరిబాబు, షీల్డ్ బహుమతి దాతగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు పాల్వాయి స్రవంతి, క్రికెట్ కిట్టు దాతగా గుండ్రెడ్డి రామలింగారెడ్డి, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ షీల్డ్ దాతగా కురుపాటి సుదర్శన్ ఉన్నారని తెలిపారు. టోర్నమెంట్ నిర్వాహకులకు తుమ్మలపల్లి గ్రామానికి చెందిన పోలోజు సత్యనారాయణ టీ షర్ట్స్ స్పాన్సర్ చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు కాశమల్ల అనిల్ కుమార్, జెర్రిపోతుల రాజు గౌడ్, జి.హనుమంతురెడ్డి, సల్వాది వెంకటేశం, కేతమళ్ల నవీన్, కేతమళ్ల ప్రకాష్, జక్కలి శివ, కురుపాటి చందు, మహేశ్వరం అజయ్, రాకేష్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన విజయగణపతి దేవాలయం



బ్రహ్మోత్సవాలకు ముస్తాబు చేసిన ఆలయం

నల్లగొండ: పట్టణంలోని రవీంద్రనగర్‌లో ఉన్న విజయగణపతి దేవాలయ సన్నిధిలో సరస్వతి, భ్రమరాంబసమేత మల్లికార్జున, అభయాంజనేయ, సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయాలు బ్రహ్మోత్సవాలకు సిద్ధమయ్యాయి. సోమవారం నుంచి ఈ నెల 13 వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11న గణపతిపూజ, మండపరాధన, సహస్ర కుంకుమార్చన, 12న రుద్రహోమం, సరస్వతి, దుర్గ, లక్ష్మీ పురుష శ్రీసూక్త హోమం, 13న పూర్ణాహుతి, అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు. హోమంలో పాల్గొనే దంపతులు రూ.316, అభిషేకం చేసే భక్తులు రూ.116, కుంకుమార్చనకు రూ.101 చెల్లించి తమ పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

నల్లగొండటౌన్: శ్రావ్య స్పీచ్ హియరింగ్ సెంటర్ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం వినికిడి పరీక్షల ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వినికిడి సమస్యతో బాధపడుతున్న వారికి డాక్టర్ రమ్య వినికిడి పరీక్ష నిర్వహించి రాయితీతో వినికడి యంత్రాలు అందజేశారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేత

శాలిగౌరారం: మండలంలోని ఇటుకులపహాడ్ గ్రామానికి చెందిన చింత నర్సయ్య, పిట్టల యాదయ్యలకు నకిరేకల్‌కు చెందిన లిటిల్ సోల్జర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ. 20వేల నగదు ఫౌండేషన్ ప్రతినిధులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారిని ఆర్థికంగా ఆదుకోవాలనే లక్ష్యంతోపాటు సమాజ సేవే ధ్యేయంగా ఫౌండేషన్ స్థాపించినట్లు తెలిపారు. ఇటుకులపహాడ్ గ్రామానికి చెందిన చింత నర్సయ్య చెట్టు నుంచి కింద పడటంతో వెన్నుపూసకు గాయాలయ్యాయి. వైద్యం కోసం ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. అదేవిధంగా పిట్టల యాదయ్య కిడ్నీలు దెబ్బతినడంతో ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఫౌండేషన్ ప్రతినిధులు గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు బ్రహ్మదేవర నరేశ్, శేషగిరి, కృష్ణప్రసాద్, శ్రీనివాస్, నాగాచారి, విలేందర్, నరేశ్, హరిప్రసాద్, రామకృష్ణ, రాంబాబు, నాగరాజు, శేఖర్, సైదులు, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.



అనారోగ్య బాధితులకు ఆర్థికసాయం అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

రామలింగేశ్వర స్వామి విగ్రహ ఊరేగింపు

నకిరేకల్: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా నకిరేకల్‌లోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం రాత్రి స్వామి వారి విగ్రహ ఊరేగింపు నిర్వహించారు. వేడుకల్లో ఆలయ చైర్మన్ రమేష్, ధర్మకర్తలు ప్రవీణారత్నారెడ్డి, చెన్నచంద్రశేఖర్, కొండ వెంకన్నగౌడ్, యాదగిరి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 1997- 98 బ్యాచ్ విద్యార్థులు

మునుగోడు: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1997–98 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

శ్రీవెంకటేశ్వర విద్యామందిర్‌లో సిల్వర్ జూబ్లీ

కనగల్: స్థానిక శ్రీవెంకటేశ్వర విద్యామందిర్ సిల్వర్ జూబ్లీని ఆదివారం కనగల్ మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రిటైర్ట్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు చేసిన సంప్రదాయ, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి. పూర్వ విద్యార్థులు హాజరై తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర సలహాదారు, ఎంవీఆర్ విద్యాసంస్థల అధినేత కొల్లుపాక రవికుమార్, ఎస్సై రామకృష్ణ, పాఠశాల కరస్పాండెంట్ వెంకన్న, ఆర్మీ రిటైర్డ్ కెప్టెన్ బెల్లి జనార్దన్ యాదవ్, ప్రముఖులు గోవర్ధన్, పాఠశాల కరస్పాండెంట్, ప్రధానోపాధ్యాయుడు బి వెంకన్న, కందుల నరసింహ, రవీందర్, పాఠశాల ఇన్‌చార్జ్ బచ్చగోని కిరణ్, బొడ్డుపల్లి రజిత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వేడుకలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

స్నేహితుల కుటుంబాలకు ఆర్థికసాయం

మునుగోడు: తమ స్నేహితుల కుటుంబాలకు అండగా నిలిచారు మునుగోడులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2003- 04 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు. 10 మంది పూర్వ విద్యార్థులు మృతిచెందగా.. వారి కుటుంబ సభ్యులను ఆదుకునేందుకు రూ.లక్ష పోగు చేసి ఒక్కో కుటుంబానికి రూ.10వేల చొప్పున అందజేశారు. ఆర్థికసాయం అందజేసిన వారిలో నల్లగొండ అంజి, కంచరకుంట్ల రవీందర్ రెడ్డి, బండి సైదులు, పి.లక్ష్మి, నేరటి మల్లేష్, పాలగోని భాస్కర్, పందుల రాజు, రాజేష్, స్వామి, శంకర్, నరేష్ తదితరులు ఉన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న స్నేహితులు

ఘనంగా సంత్ గురు రవిదాస్ జయంతి



రవిదాస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మోచి కులసంఘం ప్రతినిధులు

చిట్యాల: పట్టణ సమగర మోచి కుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం సంత్ గురురవిదాస్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గురు రవిదాస్ చిత్రపటానికి ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దొంతుల జంగయ్య, జిల్లా అధ్యక్షుడు మాస రమేష్ నివాళులర్పించారు. ఆ సంఘం పట్టణ అధ్యక్షుడు మాస నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పట్టణ గౌరవ అధ్యక్షుడు చంద్రగిరి రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు మాస వేణు, జిల్లా సహాయ కార్యదర్శి చంద్రగిరి దుర్గేష్, ప్రధాన కార్యదర్శి దొంతుల నవీన్‌కుమార్, చంద్రగిరి శంకర్, మాజ జగన్, మాజ నరేష్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వసతుల కల్పనకు కృషి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



గుండ్రాంపల్లిలో సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

చిట్యాల: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి, వెలిమినేడు, వెంబాయి, నేరడ, తాళ్లవెల్లెంల, ఎలికట్టె గ్రామాల్లో పాఠశాల అదనపు గదుల నిర్మాణం, సీసీరోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో తాళ్లవెల్లెంల, గుండ్రాంపల్లి ఎంపీటీసీ సభ్యులు వడ్డెపల్లి లక్ష్మయ్యనేత, దబ్బ పద్మకుమార్, చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకటరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, వైస్ చైర్మన్ బోంతల అంజిరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం, మాజీ సర్పంచ్‌లు ఏసిరెడ్డి బుచ్చిరెడ్డి, అద్దెల నర్సిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ, నాయకులు ఆవుల యాదయ్య, బట్టు అయిలేష్, బండ అంజయ్య, దోర్నాల రామచంద్రం, బండ కృష్ణయ్య, కొంపల్లి వెంకటరెడ్డి, కామాటి లింగయ్య, నమ్ముల విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలి

చిట్యాల: రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తుందని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. చిట్యాల పట్టణానికి చెందిన ఐఎన్‌టీయూసీ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియామకమైన ఎండీ సయ్యద్‌ను ఆదివారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐఎన్‌టీయూసీ సంఘాన్ని బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, రాము పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యం చేసిన వీరవనిత



కనగల్: సావిత్రీబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేస్తున్న కంబాల శివలీల

నల్లగొండటౌన్: సావిత్రీబాయి పూలే వర్ధంతి సందర్భంగా నల్లగొండలోని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలే చిత్ర పటానికి నివాళులర్పించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వంగూరి నారాయణయాదవ్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు సింగం లక్ష్మి మాట్లాడుతూ సమాజంలో మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడి ప్రజలను చైతన్యం చేసిన వీరవనిత సావిత్రీబాయి అని అన్నారు. ఈమె ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బోనగిరి దేవేందర్, బత్తుల శ్రీనివాస్, లక్ష్మయ్య, రాజు, వేముల ఎల్లన్న, చెరుకు మల్లిఖార్జున్‌గౌడ్, పొగాకు నాగరాజు, గుండు వెంకటేశ్వర్లు, గద్దం దశరథ, లలిత, సుజాత, సురెడ్డి సరస్వతి, బండమీది అంజయ్య పాల్గొన్నారు.

సావిత్రీబాయికి నివాళి

కనగల్: మండల కేంద్రంలో జనమైత్రి ఫౌండేషన్ అధ్యక్షురాలు కంబాల శివలీల ఆధ్వర్యంలో ఆదివారం సావిత్రీ బాయి పూలే వర్ధంతి నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకుని ప్రతి మహిళ చదువుకోవాలని తెలిపారు.

సమానత్వ సాధనకు పోరాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్ బాబు

నల్లగొండటౌన్ : బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలపై జరుగుతున్న దాడులపై, స్త్రీ పురుష సమానత్వ సాధనకు మహిళలు ఐక్యంగా పోరాడాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు పిలుపునిచ్చారు. ఆదివారం నల్లగొండలోని అంబేద్కర్ భవన్‌లో జరిగిన సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా నిర్వహించిన శ్రామిక మహిళా దినోత్సవ జిల్లా సదస్సులో ఆయన మాట్లాడారు. మహిళలను అన్ని మతాలు ద్వితీయ శ్రేణి పౌరులుగా అణిచివేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రపతి ముర్మును నూతన పార్లమెంట్ ప్రారంభోత్సవానికి, అయోధ్య రామాలయ ప్రారంభానికి పిలువకుండా అవమానించడం దేశం కళ్లార చూసిందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మహిళల ఓట్ల కోసం చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ బిల్లు తెచ్చారని మహిళలపై చిత్తశుద్ధి ఉంటే ఆ బిల్లును ఎందుకు పాస్ చేయలేదని ప్రశ్నించారు. అనంతరం పంచాయతీ మహిళా కార్మికులను సన్మానించారు. కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యురాలు కోడిరెక్క రాధిక అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి పాలడుగు ప్రభావతి, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున, బొట్టు శివకుమార్, బొల్లు రవీందర్, నర్సింహ, మల్లన్న, కృష్ణ, బాబురావు, రామస్వామి, శ్యామ్, ఎండీ.సలీం, దండంపల్లి సత్తయ్య, పోలె సత్యనారాయణ, వెంకటమ్మ, విజయ, అరుణ, సుజాత పాల్గొన్నారు.

నరసింహాచార్యులకు ఆధ్యాత్మిక వైదిక శిరోమణిరత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న నరసింహాచార్యులు

నార్కట్‌పల్లి: మండలంలోని మాండ్ర గ్రామానికి చెందిన ఉత్తరపల్లి నరసింహాచార్యులకు హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం జ్యోతిష్యరత్న, ఆధ్యాత్మిక వైదిక శిరోమణి రత్న అవార్డు ప్రకటించింది. ప్రొఫెసర్ నరసింహస్వామి, సురేష్‌బాబు, ఆకుల రజిని, ప్రవీణ్‌కుమార్, సోములు బాబు, లక్ష్మీఅరుణ, లావణ్య మిశ్రా చేతులమీదుగా ఆదివారం ఆయన అవార్డు అందుకున్నారు. జ్యోతిష్య శాస్త్రంలో ప్రసిద్ధిగాంచిన తనకు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం గుర్తించి అవార్డును ప్రదానం చేసినట్లు తెలిపారు

మూగజీవాల వలస బాట

నకిరేకల్: వర్షాభావ పరిస్థితుల కారణంగా మూగజీవాలు వలసబాట పట్టాయి. కొండమల్లేపల్లికి చెందిన రైతులు తమ ఆవులను మేపేందుకు అక్కడ గడ్డి లేకపోవడంతో నకిరేకల్, కట్టంగూర్, శాలిగౌరారం మండలాల్లో మేపుకుని తిరిగి మిర్యాల గూడెం బాట పట్టారు.

